
"'పెండ్లి పిలుపు'

తళ తళ లాడుతున్నాయి గోల్డెన్ కలర్‌లో వేసిన అక్షరాలు. రాములవారు, సీతమ్మవారు చిరునవ్వులతో పెళ్ళిదండలు మార్చుకొంటున్నారు.

లోపలి పేజీలో "చి॥ జానకిరాం అను వరునకు ల॥కుం॥చి॥ శ్యామల అను కన్యామణిని ఇచ్చి కొత్తూరు కన్యాదాత గృహమందు వివాహమహోత్సవము జరుపుటకు పెద్దలు నిశ్చయించినారు. కావున...."



# పతితల్లో పతివ్రతలు

పోల్కంపల్లి శాంతాదేవి

వెడ్డింగ్ కార్డు చదివిన మోహన్, "కొత్తూరు అంటే జడ్చర్ల దగ్గరిదే కదా? ఆ ఊరు మా ఊరే! ఈ రాఘవరావు నాకు బాగా తెలుసు. శ్యామల కూడా తెలుసు. ఎలా కుదిరిందోయ్ నీకీ సంబంధం? మీకేదైనా దగ్గర బంధుత్వముందా?" అనడిగాడు జానకిరాంని.

"బంధుత్వమేం లేదు. తెలిసిన వాళ్ళ వల్ల కుదిరింది."

"దక్షిణ.... వర దక్షిణ ఎంత?"

"పాతిక వేలు. స్కూటరు అలక పాన్పు మీద." సగర్వంగా చెప్పాడు జానకిరాం.

"పాతికేనా? లక్ష అడిగినా ఇచ్చేవాడు రాఘవరావు. అలక పాన్పు మీద స్కూటరేమిటి? కారడిగినా ఇస్తాడు, కూతురి పెళ్ళయితే చాలు."

"అంటే ఆ అమ్మాయి పెళ్ళి అంత కష్టమైందా?" సందేహంగా అడిగాడు జానకిరాం.

"ఊఁ ఏ పది ఇరవయి సంబంధాలో వచ్చి పోయి ఉంటాయి."

"పిల్ల బాగానే ఉంటుందే! బి.ఏ. దాకా చదువుకొంది కూడా."

"నువ్వే ఆ అమ్మాయికి రాసిపెట్టి

ఉన్నావేమో, ఆ అమ్మాయికి ఇదివరకు వచ్చినవన్నీ తప్పిపోయినవనుకోవాలి."

"ఏదో దాస్తున్నట్టున్నావు."

"దాయటానికేముంది? అదృష్టవంతుడివి. డబ్బున్న మామగారికి అల్లుడివవుతున్నావు."

పోయిన ఉత్సాహం రెట్టింపుగా తిరిగి వచ్చింది జానకిరాంలో. ఆఫీసరునుండి అటెండర్ వరకు పెళ్ళిపత్రికలు పంచాడు. దగ్గర స్నేహితులైతే 'పెళ్ళికి తప్పకుండా రావాలి' అని 'వస్తాం' అన్న వాగ్దానం తీసుకొన్నాడు వాళ్ళనుండి.

ఇవాళ ఒక్కరోజు ఆఫీసులో డ్యూటీ. రేపటినుండి పదిహేను రోజుల వరకు సెలవు పెట్టేశాడు. పెళ్ళి కలలతో ఈల పాటలు పాడుకొంటూ పని చేసుకొంటున్నాడు జానకిరాం.

"....ఆ అమ్మాయికి ఒక కొడుకు కూడా. జానకిరాం ఇలాంటి పిల్లను కట్టుకొంటున్నాడని బాధగా ఉంది. కాస్త ముందుగా తెలిసి ఉంటే వారించేవాడిని, ఈ సంబంధం వద్దని, తీరా ఇప్పుడు వెడ్డింగ్ కార్డ్స్ పంచాక ఎలా చెప్పడం?" మెల్లిగా అంటున్న మోహన్ చుట్టూ ఆఫీస్ స్టాఫ్ గుమిగూడసాగింది.

"అలా అని ఊరుకొంటే ఎలా? పెళ్ళి అయ్యాక ఆ పిల్ల ఇలాంటిదని తెలిస్తే మరింత బాధ కదా? బాధేమిటి? అదొక నరకం."

"అదికాదు విశ్వం, ఒక ఆడపిల్ల పెళ్ళి, అదీ ఎన్నాళ్ళకో కుదిరిన పెళ్ళి నా చేతులతో చెడగొట్టినట్టు కాదూ?"

"పెళ్ళికి ముందే చెడిపోయి ఒక కొడుకును కన్నదానికి పెళ్ళేమిటి? ఎవరి జీవితంలో నిప్పులు పోయాలని!" ఉద్రేకంగా అన్నాడు విశ్వం.

అందరూ గుంపుగా చేరి మాట్లాడుకోవడం, తన వైపే చూడడం గమనించిన జానకిరాం సంగతేమిటో తెలుసుకొందామని కదలబోతుండగానే పోస్ట్‌మెన్ వచ్చి ఒక కవరిచ్చి పోయాడతడికి.

కవరు చింపి ఉత్తరం చదువుకొని ప్రాణ్పడి పోయినట్టుగా అయ్యాడు జానకిరాం.

"అయ్యా,

జానకిరాం గారూ! పాతికవేల కట్నంతో, స్కూటర్‌తో వధువు శ్రీమహాలక్ష్మిలా మీ ఇంటికినడిచివస్తూందని సంబరపడి పోతున్నారేమో. కాని, ఆ అమ్మాయి పదహారేళ్ళప్పుడే ఒక ప్రేమ వ్యవహారంలో చిక్కుకొంది. అతడి వల్ల ఒక కొడుకునికూడా కన్నది. ఆ అబ్బాయి సజీవంగా. సలక్షణంగా పెరుగుతున్నాడు. అలాంటి అమ్మాయి మీ జీవితంలోకి నవ వధువై రావడం.... మిమ్మల్ని చూస్తే జాలిగా ఉంది. సమయం మించకుండానే మీ జీవితంలో ఈ దుర్ఘటన జరగకుండా వారించాలని నా ప్రయత్నం." క్రింద సంతకం లేదు.

ఈ ఉత్తరంలో వ్రాసిన సంగతులు నిజమేనా? ఎవరో కిట్టని వాళ్ళు కల్పించినవా? ఎవరు వ్రాసి ఉంటారు ఈ ఉత్తరం? జానకిరాం తలపట్టుకు కూచున్నాడు. మోహన్‌కి ఆ అమ్మాయి తెలుసునన్నాడుకదూ? ఈ సంగతి చెప్పబోయి దాటేశాడా? మోహన్ని అడిగితే!

అతడు తలెత్తేసరికి ఎదురుగా మోహన్ నిలబడి ఉన్నాడు. "ఉత్తరమా? ఎక్కడినుండి?"

"చూడు." ఉత్తరాన్ని అతడి ముందుకు త్రోశాడు.

మోహన్ పైనుండి క్రిందివరకు నిశ్శబ్దంగా చూశాడు. "నిన్ను ఈ ఆపదనుండి రక్షించాలని మేమంతా కలిసి నిర్ణయం తీసుకున్నామో లేదో, సరిగా సమయానికి వచ్చినట్టుగా వచ్చిందీ ఉత్తరం. ఇందులో వ్రాసిందంతా నిజం. ఆ అమ్మాయి టెంత్ క్లాసులో చదువుతున్నప్పుడు వాళ్ళక్కయ్య దగ్గర ఉండేది. వాళ్ళింటి దగ్గర జె.జె. టైలర్ అని ఒక మహమ్మదీయుడితో ఈ అమ్మాయి రొమాన్స్ నడిపించింది. సంగతి పెద్దవాళ్ళకి తెలిసేసరికి సమయం మించిపోయింది అప్పటికే అయిదు నెలల గర్భిణి. అబార్షన్ చేయిస్తే పెద్ద ప్రాణానికి ముప్పు, అని చెప్పటంతో ఆ పనివిరమించి, ఎక్కడో ఎవరూతెలియని చోట పురుడుపోసి, ఆ బిడ్డను అనాధ శరణాలయంలో వదిలి వచ్చారట. ఆ సంగతి జె.జె. టైలర్‌కి తెలిసి ఆ పిల్లవాడిని తీసుకువచ్చి తల్లి సాయంతో పెంచుకొంటున్నాడు! ఇప్పుడు అయిదో, ఆరో, ఏడో వాడికి. ఈ అమ్మాయిని హైదరాబాదులో వాళ్ళన్నయ్య దగ్గర చాలా కట్టుదిట్టాలలో ఉంచి బి.ఎ. వరకు చదివించారు. ఆ అమ్మాయికి సంబంధం వచ్చినా ఈ టైలర్‌గాడి వల్లో. ఆ పిల్ల సంగతి తెలిసిన ఏనాటోటి వాడి వల్లో తిరిగి పోతున్నాయి! వెడ్డింగ్ కార్డ్స్ వరకూ వచ్చిన దురదృష్టవంతుడివి ఒక్కనువ్వే!"

పదినిమిషాల ముందు పెళ్ళి కళతో కలకలలాడిన జానకిరాం ముఖంలో ఇప్పుడు ప్రేతకళ చోటు చేసుకొంది. "జె.జె. టైలర్ నీకు తెలుసా? నాతో రాగలవా?"

"ఈ పుణ్యం నాదేనని అందరికీ తెలిసి పోవడానికా? నేను రానుగాని అతడి అడ్రస్ ఇస్తాను! వెళ్ళిరా!"

ఒక్కరోజు సెలవు తరువాత మిగతా సెలవు కాన్సిల్ చేసుకొని వచ్చి డ్యూటీలో జాయిన్ అయ్యాడు జానకిరాం.

"వెళ్ళావా? కలిశావా?" కుతూహలంతో అతడి చుట్టు మూగారు ఫ్రెండ్స్.

"ఆఁ వెళ్ళాను! కలిశాను! మోహన్ చెప్పిందంతా నిజం!"

"నాదో ధర్మసందేహం! ఇలా వచ్చిన సంబంధాలు చెడగొట్టేబదులు వాడే పెళ్ళి చేసుకొంటే పోలేదూ?" అడిగాడు విశ్వం.

"రాఘవరావు బాగా డబ్బున్న వాడు! రాజకీయంగా పలుకుబడి ఉన్నవాడు. ఆయన్ని ఎదిరించి చేసుకొనేంత ధైర్యం ఆ టైలర్‌కి లేదు! చేసుకొంటే తక్షణం యమపురికి ప్రయాణం కట్టించగలడు రాఘవరావు. ఆ సంగతి వాడికి తెలుసు!" అన్నాడు మోహన్.

"అయితే ఈ పెళ్ళి కాన్సిల్ అయినట్టేనా, జానకిరాం?"

"కాన్సిలే! అడ్వాన్స్‌గా కట్నం డబ్బు కూడా వాపస్ చేయించాం!"

నాలుగు రోజుల తరువాత.

జానకిరాం ఆఫీసునుండి ఇంటికి వెడుతున్నాడు.

అతడి ప్రక్కన రాఘవరావు జీపు ఆగింది, జీపునిండా గూండాగాళ్ళని నింపుకొని!


"పెళ్ళి అనుకొన్నాం! పెళ్ళి పత్రికలు పంచాం! ఇప్పుడు పెళ్ళి కాన్సిల్ అని కబురు చేస్తే ఎవరు ఊరుకొంటారోయ్! పద! శ్యామల మెడలో మాంగల్యం కట్టాకే నీకు విడుదల! నువ్వు కాన్సిల్ అని కబురుచేస్తే నోరు మూసుకు ఉండడానికి ఈ రాఘవరావు దద్దమ్మ కాదు!"

గూండాలు జానకిరాంను జీపులోకి లాగారు.

ఏం జరుగుతూందో తెలియనంతగా మతిపోయింది జానకిరాంకు. అన్ని కార్యక్రమాలు అతడి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే జరిగిపోయాయి. యాంత్రికంగా అతడి చేతులు పెళ్ళి కూతురు మెడలో మూడుముళ్ళు వేశాయి.

* * *

జానకిరాం జీవితంలో విషాదాంకానికి తెర తీసినట్టుగా అయింది! భరించలేనంత అవమానంగా ఉంది! చెప్పలేనంత బాధగా ఉంది! జీవితంలో ఎవరికీ ఇలాంటి అవమానం జరిగి ఉండదు! ఇలాంటి పిల్ల భార్యగా వచ్చి ఉండదు! పెళ్ళి అంటే కోటి కోరికలు ఫలింపజేసేది! తన




జీవితంలో ఈ పెళ్ళి ఒక శాపంగా పరిణమించింది! ఒక చెడిపోయిన దానికి, బిడ్డ తల్లికీ తను భర్తా? ఛీఛీ! కంపరంగా ప్రతిక్షణం విలవిల్లాడుతున్నాడు.

రెండు రోజుల వరకు గదిలోంచి బయటికి రాలేదు జానకిరాం.

"కౌసల్యా సుప్రజారామ పూర్వా సంధ్యా ప్రవర్తతే...."

ప్రక్కవాటాలో కోదండరామయ్య భగవదర్చన ప్రారంభించినట్టుగా వేంకటేశ్వర సుప్రభాతం వినిపించింది!

ఆయన భార్య అరుంధతి. ఆమెను 'అక్కయ్యా'అని పిలుస్తాడు జానకిరాం. స్త్రీ అంటే ఇలా ఉండాలి! ఇల్లాలంటే ఇలా ఉండాలి అనిపించేట్టుగా ఉంటుంది అరుంధతి. జానకిరాంను ఆప్యాయంగా తమ్ముడూ అని పిలుస్తుంది. పండగైనా పబ్బమైనా అతడిని భోజనానికి పిలువకుండా ఉండదు! కోదండ రామయ్య కూడా అంతే ఆప్యాయత చూపెడతాడు అతడంటే.

ఆ దంపతులంటే చెప్పలేనంత ఇష్టం జానకిరాంకు.

ఒంటరిగా ఈ వేదనతో వేగిపోయే కంటే ఓ గంట వాళ్ళ దగ్గర కాలక్షేపం చేసి వద్దామని బయల్దేరాడు ప్రక్కవాటా వైపు.

కోదండరామయ్య పూజ ముగించుకొని, టిఫిన్‌కి వెళ్ళబోతున్నాడు డైనింగ్ హాల్లోకి.

"నాన్నా! జానకి మామయ్యవచ్చాడు!" అంటూ వచ్చి చెప్పింది చిన్న కూతురు రమ.

"రావోయ్, క్రొత్త పెళ్ళికొడుకా! మంచి సమయానికి వచ్చావు. మీ అక్క దోసెలు పోస్తూంది! వేడివేడి దోసెలు!" బయటికి వచ్చి హుషారుగా పిలిచాడు జానకిరాంను.

"ఏం దోసెలు, బావా? నాకు తిండి మీద ఆసక్తి చచ్చిపోయింది! అసలు బ్రతుకు మీదే ఆశ చచ్చిపోయింది!" నిరాశతో ఒక నిట్టూర్పు విడుస్తూ అన్నాడు జానకిరాం.

"అంత నిరాశేమిటయ్యా? ఇప్పుడేమైందని?"

"జరిగింది చిన్న విషయమా? ఇప్పుడేమైందని నెమ్మదిగా అడుగుతున్నావు!"

"అమ్మాయిని కాపురానికి తీసుకువస్తున్నావా లేదా?"

"ఛీఛీ! దానితో నాకు కాపురం ఏమిటి? బలవంతంగా నాచేత తాళికట్టించారుగాని బలవంతంగా ఆమెతో కాపురం చేయించలేరుగా? కోర్టులో కేసు పెట్టబో

తున్నాను!" రుసరుసలాడుతూ అన్నాడు జానకిరాం.

"ఈ విషయం మీద మనం సావకాశంగా చర్చిద్దాంగాని ముందు దోసెలు తిందాంరా! దోసెలు చల్లబడిపోతున్నాయి!" జానకిరాం రెక్కపట్టుకొని డైనింగ్ టేబిల్ దగ్గరికి తీసికెళ్ళి కూర్చోబెట్టాడు కోదండరామయ్య.

వేడివేడి దోసెలు పెనంమీది నుండి తెచ్చివేస్తూంది అరుంధతి. కోదండరామయ్య దోసెల రుచి మెచ్చుకొంటూ అపురూపురుమన్నట్టుగా తింటున్నాడుగాని జానకిరాం మాత్రం ఒక్కముక్క కూడా నోట్లో పెట్టలేదు! చేతికి చెంపను జేర్చి ఒక విషాద మూర్తిలా కూర్చొన్నాడు.

"దోసె చల్లబడిపోయింది. అది ఉంచెయ్యి! ఇదిగో వేడి దోసె! తిను! తినకపోతే నా మీద వట్టు!" అతడి భుజం తట్టి మరీ చెప్పింది అరుంధతి.

ఇక తప్పదన్నట్టుగా దోసె తినడం మొదలుపెట్టాడు జానకిరాం.

"కోర్టులో కేసు పెట్టబోతున్నావని విన్నాను. నిజమేనా!" అరుంధతి అడిగింది స్టౌమీద దోసెలు పోస్తూనే.

"ఆఁ నిజమే,"

"ఏమని పెడుతున్నావు!"

"ఆ అమ్మాయి మంచిది కాదని, బలవంతంగా ఈ పెళ్ళి జరిగిందని."

"సాక్ష్యం ఎవరొస్తారట, ఆ అమ్మాయి మంచిది కాదని చెప్పడానికి!" కోదండరామయ్య ప్రశ్నించాడు.

"దాని ప్రియుడొస్తాడు. అతడితో సంబంధం కలిగి ఉండడం తెలిసిన వాళ్ళు వస్తారు." దూకుడుగా అన్నాడు జానకిరాం.

"ప్రియుడూ రాడు. సంబంధం కలిగి ఉండడం తెలిసినవాళ్ళూ రారు కోర్టులో సాక్ష్యమంటే."

"ఎందుకు రారు!"

"కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పేంత ధైర్యమేఉంటే వాడు ఎవరికీ భయపడకుండా ఆ అమ్మాయిని పెళ్ళాడి ఉండేవాడు. లేదు కాబట్టే ఇలాంటి ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాసి ఆ అమ్మాయికి కుదిరిన సంబంధాలు చెడగొడుతున్నాడు. ఇకపోతే, నువ్వు వెళ్ళి ఆ ఊళ్ళో ఎంక్వైరీ చేశానంటున్నావు! ఎంక్వైరీలో నిజమని తేలిందంటున్నావ్. కాని, వాళ్ళంతా వచ్చి, కోర్టులో సాక్ష్యం చెప్పలేరు."

"అదే! ఎందుకు చెప్పలేరంటున్నాను!"

"కోర్టు అంటే అందరికీ భయం. బోనెక్కి దేవుడిమీద ప్రమాణంచేసి ఒకమ్మాయి చెడ్డదని చెప్పడానికి ఎవరికీ నోరు రాదు. పోతే, ఆ అమ్మాయి తండ్రి బాగాడబ్బు పలుకుబడీఉన్నవాడు. అతడికి ఎదురు నిలిచి మాట్లాడే మొనగాడు లేడని విన్నాను."

"అదే అతడి పొగరు. అతడి పొగరు నే నణుస్తాను."

"అంతా అయిపోయాక ఇప్పుడేం చేయగలవు అతడిని!"

"అంతా ఏమీ అయిపోలేదు. అంతా ముందే ఉంది." కుతకుతలాడిపోతున్నాడు జానకిరాం. "నా చేత బలవంతంగా తాళి కట్టించగానే అయిపోయిందా! దానితో కాపురం చేయొద్దా!"

"తాళి కట్టించగలిగినవాడు కాపురం మాత్రం చేయించలే డనుకొంటున్నావా! చూడు, త్వరలోనే అల్టిమేటం వస్తుందతడినుండి నీకు. అతడు నీ మెడలు విరచకముందే నువ్వే. ఆ అమ్మాయిని కాపురానికి తీసుకువస్తే అన్ని విధాలా బాగుంటుంది. అందరిచేతా సహృదయుడి వనిపించుకొంటావు."

"ఎవరిచేతో సహృదయుడి ననిపించుకోవడంకోసం ఒక చెడిపోయినదాన్ని, పిల్లతల్లిని తీసుకువచ్చి కాపురం పెట్టమంటావా! బాధలో ఉండి నీ దగ్గరికి వస్తే ఇదా నువ్విచ్చే సలహా! కడుపు నిండినవాడి మాటలివి. దేవతలాంటి మనిషి నీకు భార్య అయింది. నీకు నేను పొందిన అవమానం ఏమిటో ఎలా తెలుస్తుంది! నువ్వే నా స్థానంలో ఉంటే!"

"అదా నీ బాధ! సరే! నీ కో కథ చెబుతాను. ఈ టీ తీసుకో ముందు."

టీ త్రాగాక జానకిరాంని తీసికొని డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు కోదండరామయ్య. తలుపులు దగ్గరేసి వచ్చి కూర్చున్నాడు జానకిరాంకి ఎదురుగా, సోఫాలో.

"జానకీ! కిటికీలోంచి అవతలికి చూడు. ఎవరు కనిపిస్తున్నారు!"

"ఆవిడా! ఆవిడ శంకరమ్మ."

"ఆమె కథ తెలుసా?"


"ఎవరూ లేని అనాథ అనుకొంటాను. వాళ్ళ వీళ్ళ ఇళ్ళల్లో పనిచేస్తూ ఉండేది. ఇప్పుడేమిటో పేషెంటులాగా, పిచ్చిదానిలాగా అయిపోయింది."

"అంతేనా నీకు తెలిసింది! ఆమెకు నీలాంటి ఒక కొడుకున్నాడు. నాలాంటి ఒక భర్త ఉన్నాడు."

"నిజమా! కొడుకూ, భర్తా ఉంటే ఇలా ఎందుకైంది!" ఆశ్చర్యంగా అడిగాడు జానకిరాం.

"కొడుకు ఏడాది పిల్లవాడుగా ఉన్నప్పుడు ఆమెను భర్త ఇంటినుండి వెళ్ళగొట్టాడు తప్పుచేసిందన్న అనుమానంతో. కొడుకుని లాక్కొని ఒంటరిగా బజారుపాలు చేశాడు. యవ్వనం ఉన్నంతవరకు అది అమ్ముకొని బ్రతికింది. అది అయిపోయాక కొన్నాళ్ళు రెక్కలమ్ముకొంది. ఇప్పుడు అమ్ముకోడాని కేమీలేక అడుక్కు తింటూంది. ఆవిడయవ్వనంలో ఉండగా నేను చూశాను, ఎంత అందంగా ఉండేదో! ఇప్పుడు అందం అనేది ఆమెలో ఎక్కడా మిగల్లేదు.

"ఆమె తప్పు చేసినప్పుడు ఆమె భర్త కొద్దిగా సహృదయత చూపిఉంటే!




ఆమె తప్పు 'దిద్దుకొనే అవకాశం కొద్దిగా ఇచ్చి ఉంటే? ఆమె జీవితం ఇలా పతనమయ్యేది కాదు. భర్తతో, పిల్లలతో చక్కగా సంసారం చేస్తూ ఉండేది."

"తప్పు చేశాక ఏ మగాడైనా ఎలా భరిస్తాడు, బావా? అలాంటి నీతి నియమం లేని స్త్రీలకి బజారే తగిన చోటు."

"చాలా నిర్దయగా మాట్లాడుతున్నావు జానకీ! మానసిక దౌర్బల్యమో, వ్యామోహమో, పరిస్థితుల ప్రాబల్యమో కొందరు స్త్రీలు కాలు జారుతారు. మనిషిగా మనంచేయాల్సిందేమిటి? జారిన ఆ కాలుని వెనక్కి తీసుకొని సరిగా నిలబడేట్టు చేయడం. అంతేకాని, వాళ్ళ నింకా అధఃపాతాళానికి త్రోసెయ్యడం కాదు."

"వాళ్ళ బుద్ధే అంత అయినప్పుడు మనం ఏంచేస్తాం?"

"వాళ్ళబుద్ధిని సరిదిద్దుకొనే అవకాశం మనం ఇచ్చి చూడాలంటాను. ఏకాస్త బుద్ధివున్న ఆడదైనా మనం ఇచ్చిన అవకాశాన్ని వృధా చేసుకోదని నా అభిప్రాయం. నమ్మకం కూడా!"

"పవిత్రంగా ఉండాలన్న బుద్ధి స్వయంగా ఉండాలిగాని ఒకరు చెబితే ఎంత వస్తుంది?"

"కాలుజారి భర్త సహృదయతతో సరిదిద్దుకోగలిగిన ఒక స్త్రీని నీకు పరిచయం చేస్తాను, జానకీ! ముందుగా నేనొక కథ చెబుతాను. విను కథంటే కథ కాదు. నిజంగా జరిగిన ఒక సంఘటన." కోదండరామయ్య చెప్పడం మొదలు పెట్టాడు.

* * *

ఆ రోజు తల్లి ఊరికి వెళ్ళిపోతుంటే ఒక గంటముందుగా ఇంటికి వెళ్ళడానికి ఆఫీసరు నుండి పర్మిషన్ తీసుకువచ్చాడు రఘు. తల్లి అన్నీ సర్దుకొని తయారుగా ఉందప్పటికే. తల్లిని తీసుకొని బస్ స్టాండ్‌కు వచ్చాడు రఘు.

ఆమె ఏదో చెప్పాలనుకొని చెప్పడానికి సంకోచపడుతున్నట్టుగా గ్రహించి "ఏమిటమ్మా! ఏదైనా అడగాలనుకుంటున్నావా?" అనడిగాడు రఘు.

"చెబితే ఏమౌతుందో, చెప్పకపోతే ఏమౌతుందో అని భయంగా ఉందిరా! అమ్మ ఓ నెలరోజులపాటు కొడుకు దగ్గర ఉండటానికివచ్చి వెడుతూ ఈ చిచ్చుపెట్టి వెళ్ళిందే అనుకుంటావేమో."

"నువ్వు చెప్పదలుచుకొన్నదేమిటో చెప్పమ్మా. ఆపై ఆలోచించుకొనే విచక్షణ నాకుంది. ఇందిర సంగతేనా?"

"ఇందిర సంగతేరా! తను నీకు దూరమైపోతున్నట్టుగా నా అనుమానం. నువ్వు లేనప్పుడు ఆ భాస్కర్ వస్తుంటాడు వాడితో ఎడతెగని కబుర్లు, నవ్వులు. మొన్న పిల్లల్ని ఇంట్లో వదిలేసి వాడితో మ్యాట్నీ షో సినిమా చూసి వచ్చింది. ఇప్పుడు నేను కూడా ఇంట్లో ఉండను. నువ్వు ఆఫీసులో చచ్చిచెడి పనిచేసి ఏ రాత్రికో వస్తావు. దానికిక అడ్డు అదుపు అనేది ఉండదు."

సహజంగా కోడళ్ళంటే ఏ అత్తలకీ పడదు. అమ్మకూడా ఈర్షకొద్దీ ఇందిర మీద చాడీలు చెబుతూందా అనిపించింది. అమ్మ అలాంటిది కాదే! ఆవిడ ఈర్షకొద్దీ చెప్పినట్టుగా లేదు. ఆవేదన వ్యక్తం చేస్తూ చెప్పిందేగాని. మరి ఇందిరకూడా అలాంటిది కాదే! తమ పెళ్ళయి అయిదు సంవత్సరాలైంది. ముత్యాల్లా ఇద్దరు పిల్లల్ని కన్నది. ఒకడు బాబు, ఒకతి పాప. ఈ అయిదు సంవత్సరాలు తమది ఎంతో అనురాగ దాంపత్యమన్నట్టుగా గడిపారు. ఇప్పుడీ భాస్కర్ ఎక్కడి నుండి వచ్చాడు తమ మధ్య అగాధం సృష్టించడానికి?

భాస్కర్ ఇందిరకు మేనమామ కొడుకు. నిరుద్యోగంగా ఉంటున్నాడు. ఉద్యోగాన్వేషణలో ఇక్కడ వాళ్ళ బంధువులింట్లో వచ్చి ఉంటున్నాడు. అప్పుడప్పుడూ ఇందిర కోసం వస్తుంటాడని తెలుసుగాని, తల్లి చెప్పినట్టుగా ఎంతమాత్రం ఊహించ లేదు రఘు. ఇందిరని అలా ఊహించుకోడానికే మనస్కొప్పడం లేదసలు. బావా మరదళ్ళు వరుసకదూ? కొంచెం చనువుగా ఉన్నారేమో. స్త్రీ సహజమైన అనుమానం కొద్దీ అమ్మ అపార్థం చేసుకొందేమో!

తల్లి బస్సు ఎక్కడానికి ముందు వీడ్కోలు తీసుకొంటూ అంది. "నా మాట పట్టుకొని ఇందిరతో గొడవేమీ పెట్టుకో వద్దు కాని, జాగ్రత్తగా ఉండు. ఇందిర తప్పుదోవన పడితేమటుకు సాధ్యమైనంతవరకు గుట్టుగా చక్కదిద్దుకోడానికి ప్రయత్నించుగాని నీ సంసారాన్ని బజారున పడేసుకోవద్దు. పిల్లలు అనాథలౌతారు. వాళ్ళకోసమైన ఆ విషయాన్ని గుట్టుగా నీ గుండెలో దాచుకోక తప్పదు."

ఇందిర మీద అమ్మకి ఈర్షే అయితే ఇలా చెప్పదు తనకు బుద్ధి. 'దాన్ని చెప్పుచ్చుకు కొట్టు నరికిపడేయ్!' అని చెప్పేది.

ఆ రోజు నుండి ఇందిరని జాగ్రత్తగా గమనించ సాగాడు రఘు. త్వరలోనే తల్లి అనవసరంగా అనుమానపడలేదన్న నిర్ధారణకు వచ్చేశాడు.

ఒకరోజు ఇందిర, బాస్కర్ ఏక శయ్యమీద ఉండగా పట్టేశాడు. భాస్కర్ దొడ్డిగుమ్మం లోంచి పారిపోగా ఇందిర వంచిన తల ఎత్తకుండా నిలబడిపోయింది అపరాధిలా.

"ఇప్పుడు ఏం చెయ్యాలి, ఇందిరా నిన్ను?" నిప్పు రవ్వ భగ్గు మన్నట్టుగా అడిగాడు రఘు.

"........"ఇందిర నుండి సమాధానం లేదు. బుగ్గల మీదినుండి కన్నీళ్ళు కారిపోతున్నాయి. మనిషి వణికి పోతూంది.

"అంత భయపడే దానివి ఈ పని ఎందుకు చేశావ్?"

వెక్కి వెక్కి ఏడ్వడం తప్ప ఇందిర నుండి సమాధానం లేదు.

"నువ్వు చేసింది తప్పు అదైనా ఒప్పుకొంటావా లేదా?"

ఒప్పుకొంటున్నట్టుగా తలూగించింది ఇందిర.

"తప్పని తెలిసీ ఎలా చేశావీ పని?"

ఇందిర ఏడుస్తూనే చెప్పింది. "మీతో నా పెళ్ళికి ముందే బావా నేను ప్రేమించుకొన్నాం. పెద్దవాళ్ళకి ఇష్టం లేకపోవడం వల్ల మా పెళ్ళి జ ర గ లే దు. బావని మరిచిపోయి మీతో కలసిపోతున్న సమయంలో అనుకోకుండా బావ ఇక్కడికి రావడం జరిగింది. పాత ప్రేమ తిరిగి చివురు తొడిగినట్టుగా అయింది."

"అయితే పిల్లల్ని వదిలేసి వెళ్ళి మీ బావని పెళ్ళి చేసుకోగలవా? నువ్విష్టపడితే నేను చేస్తాను మీ ఇద్దరికీ వివాహం."

ఇందిర చప్పున రఘు కాళ్ళు పట్టుకొంది "ఈ సంగతి మా అమ్మా నాన్నకి తెలిస్తే నిలువునా చీరేస్తారు. బాస్కర్‌కి కూడా నన్ను పెళ్ళిచేసుకొని కాపురం చేసే ధైర్యం ఉందనుకోను. ధైర్యం అలా ఉంచండి. నేనంటే ఎంత ఇష్టమున్నా మగనాలిని, ఇద్దరు బిడ్డల తల్లిని పెళ్ళాడగల సహృదయత అతడికి లేదు."

"ఎంగిలి కూడును చాటుగా గతుకుతాదన్నమాట. అంతగొప్ప మనిషిని ప్రేమించానని సిగ్గులేకుండా చెబుతున్నావు చేసుకొన్నవాడి కంట్లో దుమ్ము కొట్టి వాడితో కులుకుతున్నావు. ఏమిటి దీనికి నీకు శిక్ష? నువ్వెలాంటి దానివైనా ఈ పిల్లలు నాకు పుట్టారనే నా నమ్మకం. వీళ్ళను నేను పెంచి పెద్ద చేయగలను. ఇహ నీ సంగతేమిటో నువ్వే ఆలోచించుకో. పుట్టింటికే వెడతావో, మీ బావ దగ్గరికే వెడతావో."

"మీ కాళ్ళు పట్టుకొంటాను. నన్ను నా పిల్లలనుంచి దూరం చేయకండి." రఘు కాళ్ళకు చుట్టుకొని బావురుమంది ఇందిర.

"అయితే పిల్లల్ని తీసుకొనే వెళ్ళిపోతావా?"

"వాళ్ళని నే నెలా పోషించగలను? ఎలా పెంచను? నేను బజారుల పడ్డాక?"

"మరి మగడన్నవాడితో ఇంత అవసరం ఉండగా అతడికి ఇంత ద్రోహం చేయడానికి ఎలా తలపెట్టావు?"

"నా తప్పు నా కిప్పుడు బాగా తెలిసిందండీ. నన్ను బజారున పడేయకండి. ఇకనుండి మీరెంత చెబితే అంత నడుచుకొంటాను."

తప్పు ఒక్క ఇందిరే చేయలేదు. భాస్కర్ కూడా చేశాడు. ఈ అక్రమ సంబంధం విషయంలో అతడి అభిప్రాయమేమిటో తెలుసుకోవాలి.

రఘు వెళ్ళి భాస్కర్‌ని కలిశాడు.

"సీతో సంబంధమున్న విషయం ఇందిర ఒప్పుకొంది. ఆమెనిప్పుడు వదిలివేస్తున్నాను. ఆమెను నువ్వు అంతగా ఇష్టపడుతున్నట్టయితే ఆమెను పెళ్ళి చేసుకో. పిల్లల్ని నీ మెడకి ఏం వెయ్యను. వాళ్ళని నా దగ్గరే పెట్టుకొంటాను."

"అ యి దే ళ్ళు నీతో కాపురంచేసి ఇద్దరు పిల్లల్ని కన్న తరువాత ఆమెను నేను పెళ్ళిచేసుకొనేదేమిటి?" పెళుసుగా అన్నాడు భాస్కర్.

"ఇద్దరు బిడ్డల తల్లితో, పరస్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకోవడానికి మాత్రం ఎలాంటి అభ్యంతరం కనిపించలేదు, నువ్విలా మాట్లాడతావనే నాకు తెలుసు. పరస్త్రీల వెంటబడే కుక్కలన్నీ ఇలాగే మాట్లాడతాయి. ఇప్పుడు నిన్నేమీ చెయ్యను. మరోసారి ఇందిరతో కనిపించావా, అప్పుడు చెబుతాను నీ సంగతి."

ఇంటికి వచ్చి భాస్కర్‌ని కలిసిన సంగతి ఇందిరతో చెప్పాడు.

"అతడి సంగతి నాకు ముందే తెలుసు. అనవసరంగా వెళ్ళారు మీరు." అంది ఇందిర.

"తెలిసీ అతడి వలలో ఎలా పడ్డావు?"

"అజ్ఞానమండీ."

"ఇహ అజ్ఞానం వదిలి విజ్ఞానంతో నడుచుకొంటావని ఆశిస్తున్నాను."

* * *

"ఇప్పుడు ఆ రఘు ఇందిరల దాంపత్యం ప్రపంచానికి ఆదర్శం. తరవాత

వాళ్ళకి మరో ఇద్దరు పిల్లలు పుట్టారు. ముత్యాల్లా నలుగురు పిల్లలు. ఎవరు చూసినా చల్లని సంసారం, చక్కని సంతానం అనేట్టుగా ఉన్నారు. ఆ రోజు రఘు భార్య చెడిపోయిందని వెళ్ళగొట్టి ఉంటే? అటు ఇటు మిగిలేది సర్వనాశనం. సర్వం శూన్యం. పిల్లలు అనాథలై పోయేవాళ్ళు. ఇందిర ఈ శంకరమ్మలా అయిపోయేది. మరి రఘు? అందర్నీ పోగొట్టుకొని మోడులా మిగిలిపోయే వాడు. అంతా సర్వనాశనం జరగకుండా



ఆపింది అతడి క్షమాహృదయం. తల్లి వెడుతూ చెప్పిన హితవు."

"ఆ రఘు, ఇందిర ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?" ఆత్రుతగా అడిగాడు జానకిరాం.

"నీ ఎదురుగా."

"అక్కయ్యా.... అక్కయ్యా.... నేన్నమ్మను."

"అవును. ఎవరూ నమ్మలేనంతగా ఆవిడ మారిపోయింది. ఉత్తమ గృహిణి అంటే ఈమే అనేంతగా తన జీవితాన్ని సరిదిద్దుకొంది." సంతృప్తి నిండిన స్వరంతో అన్నాడు కోదండరామయ్య.

"బలవంతంగానైనా నీ పెళ్ళి శ్యామలతో జరిగింది. ఆమె నీకు భార్యగాని ఆ జైలర్‌కి కాదు. ఆమె మంచిచెడ్డలిక నీకు చెందుతాయి గాని జైలర్‌కి చెందవు. పుట్టింట్లో ఆమె ఇదివరకు లాగ ఉండలేదు. ఎందుకంటే ఇప్పుడు పెళ్లైపోయింది కాబట్టి. పతితలు కూడా మనం ప్రేమించిన తగినవాళ్ళే. మనతో జీవింపవలసినవాళ్ళే. ఎందుకంటే మనలో అంతా మంచే లేదు. చెడు కూడా ఉంది. మంచిచెడుల సమ్మిళితం మానవుడు. విచిత్రం ఏమిటంటే మనలో మంచిని గుర్తించినంతగా చెడుని గుర్తించలేం."

"శ్యామలమీద నా కిప్పుడు కోపం లేదు. అసహ్యం లేదు. నా కోపమంతా రాఘవరావుమీదే. అతడికి శాస్తి చేయాలి నేను."

"అతడికి శాస్తి చేయడంకోసం శ్యామలని బాధపెడతావా?"

"ఆమె మనస్సింకా ఆ జైలర్‌గాడి మీదే ఉందేమో. అలాంటప్పుడు ఆమెను కాపురానికి తీసుకురావడమంత హాస్యాస్పదం మరొకటి ఉండదు కదా?"

"ఆ సంగతి ఆమెనే అడిగితే సరి కదా? తను నీతో రావడానికి ఇష్టపడితే తీసుకు వచ్చేసెయ్."

"మరి ఆ పిల్లవాడో?"

"వాడు శ్యామల కొడుకని మరచిపోవడం మంచిది."

"ప్రపంచం నన్ను చూసి నవ్వదా?"

"ఎందుకు నవ్వుతుంది? తప్పటడుగు వేసిన ఒక స్త్రీని భార్యగా మన్నించడం చూశా? నువ్వు చూపిస్తున్నది కేవలం సహృదయత. మట్టిలో కలిసిపోవలసిన దాన్ని మనిషిగా నిలబెడుతున్నావు. పతి తల్లోనూ పతివ్రతలుంటారని చూపబోతు న్నావు. దాన్ని చూసి నవ్వాల్సిందేముం టుంది?"

* * *

"వచ్చావా? రాక ఎక్కడికి పోతావు? రాకపోతే రప్పిస్తానని నీకు తెలుసు. నాకా పని కల్పించడం ఎందుకని నువ్వే వచ్చావు. గుడ్." సగర్వంగా నవ్వాడు రాఘవరావు.

"శ్యామల ఎక్కడ? ఆమెతో మాట్లా డాలి నేను." సీరియస్‌గా అన్నాడు జానకిరాం.

"అంత ఆతృత ఎందుకు, క్రొత్త పెళ్ళికొడుకా ముందు కాళ్ళు కడుక్కో."

"నేను మర్యాదల కోసం రాలేదు. శ్యామల వస్తే నాతో తీసికెళ్ళడానికి వచ్చాను."

"అంత తొందరేమిటి, అల్లుడూ! కూర్చో!"

"నన్ను కూర్చోబెట్టడానికి కూడా నీ గూండాలని పిలిచేట్టున్నావే."

"అత్తవారింటికి క్రొత్తగా వచ్చిన అల్లుడివి."

"మర్యాదలకోసం రాలేదని ముందే చెప్పాను. శ్యామలని తీసుకు పోవడానికి వచ్చాను."

"అబ్బ. గుఱ్ఱం ఎక్కివచ్చావే. మురళీ, బావని మీ అక్కయ్య దగ్గరికి తీసుకెళ్ళు." చిన్న కొడుకుతో చెప్పాడు రాఘవరావు.

జానకిరాం రావడం ఇందాకే కిటికీ లోంచి చూసింది శ్యామల. కొట్టుకొనే గుండెలతో ఓ గోడకి నిలబడింది. అడు గుల చప్పుడుని బట్టీ అతడు గదిలోకి వచ్చా డని తెలుసుకొంది.

"తీసుకెళ్ళడానికి వచ్చాను. నాతో వస్తావా?"

శ్యామల తలెత్తకుండానే వస్తానన్న ట్టుగా తలూగించింది.

"మనస్ఫూర్తిగా నాతో కలసి ఉండ గలవంటేనే తీసికెడతాను."

శ్యామల కొద్దిగా తలెత్తి. "మీరు మనస్ఫూర్తిగా తీసికెడున్నారా నన్ను?" అని ఎదురు ప్రశ్నించింది.

"మనస్ఫూర్తిగానే! నీ సంగతి చెప్పు"

"మనస్ఫూర్తిగానేనండీ. ఈ నరకం లోనే శాశ్వతంగా ఉండిపోతానేమో నని అనుక్షణం కుళ్ళిపోయాను. హఠాత్తుగా నా దేవుడు ప్రత్యక్షమై నన్ను స్వర్గానికి తీసికెడతా నంటుంటే.... ఇంత అదృ ష్టమా నాకని నమ్మలేకపోతున్నానండీ..." అంది గాద్గదికంగా, శ్యామల.

"మరి ఇదివరలో నీ ప్రేమ వ్యవ హారం...."

శ్యామల దెబ్బతిన్నట్టుగా, "అదంతా నేను గతం అనుకొంటున్నాను. ఎప్పుడో మరిచిపోయాను. తెలిసీ తెలియని వయ సులో పడిన తప్పటడుగు అది. దాని గురించి ఇంకెన్నడూ మీరు తీసుకురా నంటేనే నేను మీతో వస్తాను. లేక పోతే ఆ నరకం కంటే ఈ నరకమే మేలు నాకు." అంది ఖచ్చితంగా.

"నాకు కావలసింది అదే, శ్యామలా. అదంతా గతం, దానిమీద సమాధి కట్టేసి నూతన జీవితం ప్రారంభించడానికి నాతో బయల్దేరు. నేను నీకు కట్టిన ఒక్క తాళి తప్ప నీ ఒంటిమీద మాసమెత్తు బంగారం ఉంచుకోకు. అంతా తీసి మీవాళ్ళకిచ్చెయ్. కట్టు బట్టలతో నాతోరా. శాశ్వతంగా ఈ గడప దాటుతున్నానని గుర్తుపెట్టుకొనిరా.

"అదేమిటండి?" శ్యామల ముఖం పాలిపోయింది.

"మీ నాన్నకి నేను చేయదలిచిన శాస్తి అది. డబ్బు, గూండాలు తనకున్నారని అన్నీ తను అనుకొన్నట్టుగా సాధించ గలననుకొంటున్నాడు. నిన్ను నేను కాపు రానికి తీసికెళ్ళడం కూడా తన డబ్బుకు, గూండాలకు భయపడే ననుకొంటు న్నాడు!"

కట్టుబట్టలతో భర్తతో బయల్దేరుతున్న శ్యామలని చూసి గుండె చెరువయ్యేట్టుగా ఏడ్చింది శ్యామల తల్లి. "కాపురానికంటూ తీసికెళ్ళి పిల్లని చంపేసి మీమీద కక్ష తీర్చుకొంటాడేమోనండీ." అంది భర్తతో.

"ఏడ్చాడు, శ్యామలని ఏమైనా చేస్తే వాడు బ్రతుకుతాడా?" పైకి బింకంగా అన్నాడుగాని లోలోపల అదే భయ ముంది అతడికి. "అమ్మాయికేమైనా బాధ పెట్టినట్టు తెలిసిందా, అంతకు అంత బదులు తీర్చుకొంటాను. గుర్తుంచుకో." అన్నాడు బయల్దేరుతున్న అల్లుడితో.

"ఏడ్చావ్. నీకు భయపడి ఆమెని తీసికెళ్ళడం లేదు. తాళి కట్టాను కాబట్టి తీసికెడుతున్నాను." నిర్లక్ష్యంగా అని శ్యామలతో గడపదాటాడు జానకిరాం.

